# మోక్షమార్గము (1837)

## (బళ్ళారి కరపత్రము)

ఓ జనులారా, దేవుడు మీకు మోక్షమునివ్వవలెనని మీరు కోరుచున్నారు గదా. అది మంచి కోరికే. ఆలాటి కోరికె కలిగి యుండేటప్పుడాయన మనకు మోక్షమునిచ్చుటకు తగిన కారణ మును మీరు బాగా పరిశోధించవలసినది. ఆయన తన స్వాధీనమైన కృపచేత దాని యిచ్చునో లేక మీరాయనకు చేసిన మేలులకు బదులుగా న్యాయము చొప్పున యిచ్చునో దాని శోధించి చూడుడీ. మనము సత్రములను కట్టించి, కోనేరులను తవ్వించి, చలివేంద్రలను బెట్టించి యనేలకు అన్న వస్త్రములనిచ్చి, యనేకదినములు వొక్క ప్రొద్దుండి, కాశీ, రామేశ్వరం, కంచి మొదలైన స్థలములకు బోయి కానుకలనిచ్చుటవల్ల దేవుడు మనకు మోక్షమునిచ్చునని చెప్పితిరట్టాయినా, అప్పుడు మీకు మీరే మోక్షమును సంపాదించు కొన్నట్టుగా నుండును. యెందుకంటె దాని కృపచేత నడుగకుండా న్యాయము చేత నడుగవచ్చును. యిదిగాక ఆయన దాని మీకివ్వక పోతే ఆయన అన్యాయమును చేసినాడని మీరు చెప్పవచ్చును. మీరీలాగు చెప్పక, కర్తునికి మన మేమి మేలులను చేతుము, ఆయనకు మన యొక్క మేలులు కావలసి యుండవు, యే రీతినైనా ఆయనే మనకు మోక్షము నిచ్చునని చెప్పితిరట్టాయినా మీరు న్యాయము చేత నడుగకుండా కృపచేతనే ఆయనను మోక్షము నడుగవలసినది. కృపచేతనాయన మీకు మోక్షమునివ్వక మిమ్ము విసర్జించినట్టయితే మీరది యన్యాయమని చెప్పకూడదు. దీని గురించి వొక సామ్యమును వినుడి. ఒక దొరసేవకుడైన సాత్తుడనేవాడు అతనివద్ద పని చెయ్యక అచ్చుటచ్చుట తిరిగి దుర్మా ర్గమందు నడిచి దొరయొక్క నామమును దూషించి, యతని మీద ఉాళ్ళు వేసి, యతని పాత్రలను పగలకొట్టి, తోటలో నున్న చెట్లను పాడు చేసి దొర చెప్పే బుద్ధులను వినక అధికముగా చెడ్డమాటలను చెప్పుచూ యీ

ప్రకారము వొక నెలంతా దుష్టుడుగా నడిచిన పిమ్మట వానికి వ్యాధి, పస్తు మొదలైన కఠిన శ్రమలు వచ్చినప్పుడు వాడు దొరవద్దికి వచ్చి జీతము నివ్వవలెనని యడిగితే దొరవాని చూచి నీవు నావద్ద పని చెయ్యక నన్ను విడిచిపోయి నన్ను దూషించి చెడ్డ క్రియలను చేసి నందు చేత నీకు జీతము నివ్వకూడదని చెప్పి వాని విసర్జించినాడు. వివేకుడనే మఱియొక సేవకుడు నెలరోజులతని తోటలో వంచన లేకుండా పనిచేసి, నెల అయిన తర్వాత వచ్చి యతని జీతమునడిగెను. తక్షణమందే అతడు వానికి జీతమునిచ్చినాడు. సొత్తుడనేవానికి యిచ్చినట్టయితే నది న్యాయము చేత నివ్వక దయచేత నిచ్చినాడని చెప్పబడును. వివేకునికతడు జీతము నివ్వక పోయినట్టయనా వాడుపోయి వ్యాజ్యము చేయవచ్చును. వాడతనికి పని చేసినందువల్ల అతడు వానికి జీతము నివ్వవలెనని న్యాయము తీర్చుదురు. అతడు యిచ్చితే యది దయచేత నివ్వక న్యాయము చేత నిచ్చినాడని చెప్పబడును. యీ మట్టుకు నేను సామ్యముగా చెప్పిన సొత్తుడు వివేకుడు వీరిలో నెవనికి మీరు సామ్యముగా నున్నారు. దేవుడు కృపచేతనో లేక న్యాయము చేతనో దేని చేత మీకు మోక్షమునివ్వవలెనని యున్నాడు. వివేకునిచొప్పున మీరు దేవుని యొక్క కట్టడలను మీరక యెప్పుడున్ను యే విధము చేతనైనా ఆయనకు ప్రియకరముగా నడిచినట్టయితే మీరు న్యాయప్రకార ముగా మోక్షమును ఆయన నడుగవచ్చును. ఆయన నీతివంతుడై యున్నందువల్ల నాలాగే మీకు యిచ్చును. వివేకునిచొప్పున మీరు దేవుని యెదుట నడవక సొత్తునివలెనే దుష్టతనముగా నడిచితే మీరు దయచేత మాత్రము ఆయనను మోక్షమునడుగవలసినది. అప్పుడు యిచ్చునో యివ్వకపోవునో యది యేలాగు తెలియబడును. న్యాయము చొప్పున మిమ్ము విసర్జించ వలెను. అయితే మీరు పాపమును చేసినామని సమ్మతించి అందుకు మేము అనేక ధర్మములను చేసినాము కాబట్టి వాటికొరకు దేవుడు మోక్షము నిచ్చునని చెప్పుచున్నారు. యీ ప్రకారము మీరేలాగు చెప్పవచ్చును. ఆ సొత్తుడు సోమరితనము గానున్ను, దుష్టతనముగా నున్ను గడిచిన నెలలో వాడు

రెండు మూడు మార్లు దొరయొక్క సెలవు లేకుండా తన యిష్టప్రకారము తోటలోకి వచ్చి కొంచంపని చేసినట్టయితే దానికొరకు దొర వానికి నెలజీతము నిచ్చునా, యివ్వడు. యిదిగాక వాడు వచ్చే నెలలో బాగా పనిచేసితే దాని కొరకు వాడు పోయిన నెలజీతమునున్ను న్యాయముగా సంపాదించకొనకూడదు. ఆ రీతిగానే మీరెప్పుడున్ను, యేవిధము గానున్ను, పాపమును చెయ్యక మేలులను చెయ్యవలసి యుండగా మీరనేకమార్లు అబద్ధమున్ను, జూదమున్ను, వంచనయున్ను, విగ్రహారాధనలున్ను, వ్యభిచారమున్ను, కామవికారమున్ను , జగడమున్ను, క్రోధమున్ను మొదలైన వాటిని చేసి యీలాగున ప్రతిదినమున్ను దేవునియొక్క కట్టడలను మీరి నడచి కొన్ని ధర్మములను చేసితె వాటికొరకు దేవుడు మీకు మోక్షమునిచ్చునా, లేక, మీరు యిరువైసంవత్సరములు కీడులనే చేసి తర్వాత నొక కాలమైనా పాపమును చేయక యెప్పుడున్ను మేలులను మాత్రమే చేసితే వాటికొరకు మీరు ఆ యిరువైసంవత్సరములు చేసిన పాపములను దేవుడు మన్నించునా, మన్నించడు. యెందువల్లనంటె యేకాలమున్ను మీరు కీడులను చెయ్యక మేలులను చేతురో యాకాలము నకు మాత్రమేగాక యింకొకకాలమునకు అవి చెల్ల నేరవు. అదిగాక ఆ సాత్తుడు దొరయందభిలాషనుంచక అతనితో సమాధానముపొందక చెడ్డమనస్సుతో భయముచేత తోటలో కొన్ని పనులను చేసితే ఆపనులు దొరకు ప్రియకరముగానుండునా? యతని చేత నంగీకరించపడునా? యవి దొరకు కావలసియయుండ నీవు నాతోటను విడిచి పొమ్మని చెప్పును గదా? అలాగే మీరున్ను దేవుని మీద భక్తి లేకనున్ను ఆయనతో సమాధానము పొందకనున్ను చెడ్డ మనస్సుతో కొన్ని ధర్మములను చేయుచువచ్చితె అవి దేవునికి ప్రియకరముగా నుండవు. ఆయన వాటినంగీకరించడు. కాబట్టి మీరు మోక్షమును కోరితే యది ఆయన యొక్క దయచేత నాయననడుగవలసినది. గాని మీరు చేసిన ధర్మములకొరకు న్యాయము చొప్పున దాని యడుగకూడదు.

సొత్తుని యందు దొర దయనుంచక విసర్జించినట్టు దేవుడు మిమ్మును విసర్జించడని నిశ్చయము గా నెఱిగి యున్నారా. ఆయన మీకు మోక్షమునిచ్చుటకు మీ ధర్మములు చాలవు. యిదిగాక మిమ్ము నరకములో తోయుటకు మీ పాపమధికముగా నున్నందున ఆయన మీమీద దయచేసి మోక్షమునిచ్చుటకు హేతువేమి. మనమేదాని సంపాదించు కొనుటకు సామర్థ్యము లేని వారమై యున్నాము. కాబట్టి దేవుడు మనవల్ల ప్రత్యుపకారము లేక తన యొక్క స్వాధీనమైన దయచేతనే మనల రక్షించవలెనని చిత్తముగలవాడైయున్నాడు. యేలాగంటే మన యొక్క పాపములను పరిహరించుట కాయన తనయొక్క యేకపుత్రుడైన యేసుక్రీస్తును మరణమున కొప్పగించేటంత ప్రీతి మనయందుంచి యున్నాడు. యేసు క్రీస్తు మనుష్యావతారమునెత్తి యే తప్పున్ను లేక పరిశుద్ధమైన వాడుగా నడిచి మనకు నీతినుపదేశించి మనయొక్క పాపములకు తగిన ఆజ్ఞను వహించి నిండా కష్టపడి మరణమును పొంది తనయొక్క దివ్యరక్తమును చల్లినపిమ్మట ఆయన లోకరక్షకుడుగా తోచేటట్టు తనయెుక్క పుణ్యఫలమును మనకిచ్చుటకు జీవముతో లేచి నిత్యమహిమనుపొంది పరలోకమునకు పోయి యున్నాడు. ఆయన యొక్క శ్రేష్టమైన రక్తమునిమిత్తమున్ను ఆయన యొక్క మరణము నిమిత్తమున్ను దేవుడు మన మీద దయ నుంచి మనల దండించక మోక్షరాజ్యమందు చేర్చుకొవలెననే చిత్తము కలవాడై యున్నాడు. మీరు దాని నమ్మి యేసుక్రీస్తును విస్మరించి ఆయన యొక్క పరిశుద్ధమార్గమందు నడవవలెను గాని మఱియొకటి మీరు చేయవలసినది లేదు. యీ సంగతిని గురించి ఆయన దయచేసిన పరిశుద్ధ లేఖనములయందు కొన్ని విశేషమైన వచనములనువినుడి.

నిశ్చయముగా నాయన మన బలహీనములను వహించి మనదుఃఖములను మోసుకొని యున్నాడు. ఆయన దేవునివల్ల వేదించబడి కొట్టబడి ఉపద్రవమును పొంది యున్నాడని మన మెంచితిమి. అయితే ఆయన

మన యక్రమములనిమిత్తము గాయపడి మన దోషములనిమిత్తము కొట్టబడియున్నాడు. మనకు సమాధానమును కలగజేసేయాజ్ఞ ఆయనమీద వచ్చినది. ఆయన పడిన గాయములవల్ల మనము గుణపడుచున్నాము. మనమందరమూ గొఱ్ఱెలవలెనే మార్గమునుతప్పి వాడువాడు తన స్వేచ్ఛానుసారముగా పోయియున్నాడు. అయితే యెహోవా మనయందరియొక్క అక్రమములను ఆయన మీద రాజేసియున్నాడని యెషయాయనే దీర్ఘదర్శి వ్రాసియున్నాడు. (యెషయా 53:4-6). మన కర్తయైన యేసుక్రీస్తు చెప్పిన దేమంటే నన్ను దృష్టించి చూచి నాయందు విశ్వాసముంచినవాడెవడో వాడు నిత్యజీవమును పొందుటే నన్ను పంపించిన తండ్రి యొక్క చిత్తమైయున్నదని చెప్పెను. (యోహాను 6:40) మఱిన్ని మృతిపొందినవారిలోనుంచి ఆయన లేచి పరలోకమునకెక్కి పోవుటకు మునుపే తన శిష్యులకాజ్ఞాపించినదేమంటే మీరుజగ త్తుకంతా పోయి సృష్టించబడిన వారందరికీ శుభసమా చారమును ప్రకటనచేయుడీ. విశ్వసించి బాప్తిస్మమును పొందేవాడెవడో వాడు రక్షించబడును. విశ్వసించనివాడెవడో వాడు ఆజ్ఞకులోనయ్యేటట్టు తీర్చబడునని చెప్పెను (మార్కు 16:15,16). యిదిగాకాయన పరిశయులలో యెహూడియులకు శ్రేష్ఠుడైన నికోడేమనేవానికి చెప్పినదేమంటే - మోశే ఆరణ్యములో సర్పమును యేలాగుయెత్తెనో ఆలాగాయన యందు విశ్వాసముంచే వారందరూ నాశమును పొందక నిత్యజీవమును పొందేటట్టుగా మనుష్యునికుమారుడు యెత్తబడవలెను. యెందువల్లనంటే ఆయన యందు విశ్వాస ముంచేవారందరూ నాశమును పొందకుండా నిత్యజీవమును పొందే నిమిత్తము దేవుడు తన యేక కుమారునిచ్చినట్టు జగత్తునంత ప్రీతిపఱచెను. యెందుకంటే జగత్తు నాజ్ఞకు లోబడ తీర్పు చేయుటకు దేవుడు తనకుమారుని పంపించక, అతని వల్ల జగత్తు రక్షించ బడేటట్టుగా నతని పంపించెను. ఆయన యందు విశ్వాసముంచే వాడు ఆజ్ఞకులోనయ్యే టట్టు తీర్పు చేయబడక నుండును. అయితే విశ్వసించని వాడు దేవునికొక్కడై పుట్టిన కుమారుని నామమందు విశ్వాసముంచనందున యిప్పుడే యాజ్ఞకు

లోనయ్యేటట్టు తీర్పు చేయబడియున్నాడని చెప్పెను (యోహాను 3:14-18). మరియు యేసు క్రీస్తు చెప్పినదేమంటె భారమును మోసుకొని ప్రయాసను పడేవారలారా నావద్దికి రండి. మీ యలసట తీర్చుదును. నా కాడిని మీరు మోసుకొని నేను హృదయమందు సాత్వికుడుగా నున్ను, దీనత్వము గలవాడుగానున్నున్నాను గనుక నావల్ల నేర్చుకొనుడు. అప్పుడు మీయాత్మ లలో మీకు శాంతము కలిగి యుండును. యెందుకంటే నా కాడి తేలికగా నున్ను, నా భారము చులకనగానున్ను వుండునని చెప్పెను (మత్తై 11:28-30). యిది గాక మనము పాపముల నుంచి విడిపించుకొనబడి నీతిగా బ్రతికేటట్టు అయన తన శరీరమందు మరణస్తంభముమీద మన పాపములను తానే మోసుకొనెను. ఆయన అనుభవించిన దెబ్బలవల్ల మీరు గుణపడుచున్నారు. యెందుకంటే మీరు మొదలు తప్పిపోయిన గొఱ్ఱెల వలెనే యుంటిరి. అయితే యిప్పుడు మీరు మీ యాత్మలను కాచే కర్తునివద్దికి తిరిగి వచ్చిన వారైతిరనిన్ని నీతిగల క్రీస్తు మిమ్ము దేవునివద్దికి కొంచపోవుటకు పాపములనిమిత్తము నీతి లేని వారికొరకు శ్రమబడి యున్నాడనిన్ని ప్రేషితుడైన పేతురు వ్రాసియున్నాడు (1 పేతురు 2:24,25). యెవడైనా పాపమును చేసితే తండ్రి వద్ద మనకు నీతిపరుడైన యేసుక్రీస్తనే మధ్యవర్తి యొకడున్నాడు. మరియు ఆయన మనకు మాత్రముగాక లోకమంతటికి పాపములనిమిత్తము శాంతపఱచే బలియై యున్నాడని ప్రేషితుడైన యోహాను వ్రాసియున్నాడు (1 యోహాను 1:12). మరియు ప్రేషితుడైన పౌలు వ్రాసియుం డినదేమంటే సమస్తమైన వారుపాపముచేసి దేవుని సముఖమందు అనీతివంతులైనారుగనుక యేసుక్రీస్తువల్ల కలిగిన పాపవిమోచన ముఖాంతరముగా దేవుని కృపవల్ల నీతిపరులని వుచితముగా తీర్చబడుదురు. యెందుకంటే దేవుడు తాను వోర్పుగానుండే కాలమందు మనుష్యులు చేసిన పాపములను క్షమించుటవల్ల తన నీతిని బయిలుపఱచేటట్టున్ను యీ కాలములో యేసుయందు విశ్వాసముంచిన వాని నీతివంతుడుగా తీర్చుటకు తాను నీతివంతుడని కనుపడుటకైతన

నీతిని బయిలుపఱచేటట్టున్ను ఆయన యొక్క రక్తమందు విశ్వాసముంచిన వారికొరకు సమాధానము పఱచే బలిగా నాయనను నియమించెనన్ని క్రీస్తుమన అపరాధముల నిమిత్తమప్పగించబడి మనము నీతివంతులౌటకు తిరిగి లేపబడును. కాబట్టి విశ్వాసమువల్ల మనము నీతి వంతులుగా చేయబడినందున మనకర్తయైన యేసుక్రీస్తు మూలముగా దేవుని సముఖమందు మనకు సమాధానము కలిగియున్నదనిన్ని యేసుక్రీస్తు యందుండె విశ్వాసము వల్లనే గాక మనుష్యుడు న్యాయప్రమాణమైన క్రియలవల్ల నీతి పరుడు కానేరడని తెలుసుకొనునిన్ని క్రీస్తు మనకొరకు శాపమునను భవిచినందున న్యాయప్రమాణము యొక్క శాపము నుంచి మమ్మును విడిపించి యున్నాడు. యిందుకుదా హరణమేమంటె మానిమీద కొట్టివేయబడినవాడు శపించబడిన వాడని వ్రాసియున్నదనిన్ని దేవుడు మమ్ము వుగ్రమునకు నిర్ణయించక మన కర్తయైన యేసుక్రీస్తు మూలముగా రక్షణను పొందుటకు మమ్మునిర్ణయించినాడనిన్ని వ్రాసియున్నాడు (రోమ 3:23-26, 4:25, 5:1, గలతీ 2:16, 3:13, 1తెస్స 5:9).

ఇంత పక్షముగా మనల పిలిచే కర్తకు మీరు లోబడుదు రుగాక. ఆయన చేతనే గాని మఱియొకని చేతను మీరు యిహమందు పాపక్షమనున్ను నిజమైన భాగ్యమునున్ను పరమందు మోక్షమునున్ను పొందనేరరు. మఱిన్ని యిలోకమందు మీరు ఆయనతో నన్యోన్యమైతే వచ్చేలోకమందు మీకు భయంకరమైన న్యాయపు తీర్పునివ్వక మీమీద దయచేసి తనవద్ద చేర్చుకొనును. కాబట్టి మనము ఆయనుకు తగని సేవకులముగా నాయన యొక్క కట్టడలననేక విధములుగా మీరి అయన యొక్క మహాత్యముగల సముఖమునకు రావడమునకు పాత్రులు గాకుండా నరకాగ్నికి పాత్రులమైయుండి యేసుక్రీస్తు వల్ల మన ప్రత్యుపకారము లేక కృపగా రక్షించనున్ను పాపక్షమ నివ్వనున్ను మోక్షరాజ్యమందు చేర్చుకొననున్ను చిత్తముగలవాడైయుండే దేవునికి సార్వకాలమందు స్తోత్రమున్ను ఘనమున్ను కలిగియుండునుగాక.